




# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL | ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | ఆదివారం 16-12-2023 | సంపుటి : 06 | సంచిక : 96 | పేజీలు : 8 | వెల : రూ 3-00

# శాంతిభద్రతల విభాగంలో కృషికి అవార్డులు

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసుల ఎంపి**
**డీజీపీ డిస్క్ అవార్డుల ప్రదానం: డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి**




అమరావతి,డిసెంబర్16( రాష్ట్రవ్యాప్తంగా 2022లో క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల విభాగంతో పాటు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా ఎస్పీలు, డిఐజిలు, ఐజి లు, అడిషనల్ డిజిలను గుర్తించి వారు అందించిన సేవల అర్హత అదరంగా 65 మందికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిజిపి డిస్క అవార్డులను,మెడల్స్ ను ఈ రోజు మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి ప్రదానం చేశారు. 15 మంది ఎస్పీలు గోల్డ్ మెడల్, 56 మంది కానిస్టేబుల్ నుండి ఐపిఎస్ లు సిల్వర్ మేడల్స్, 05 మంది డిఎస్పీలు,ఏఎస్ఐ లు బ్రోంజ్ మేడల్స్ ను డిజిపి గారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. కన్విక్షన్ బేస్ పోలిసింగ్ విధానాన్ని గత సంవత్సరం(2022) జూన్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నాము. ఈ విధానం ద్వారా ప్రతి ఒక్క యూనిట్ అధికారి సిపి/ఎస్పీ తమ పరిధిలోని అత్యంత ముఖ్యమైన ఐదు/ఆరు కేసులు తమ పర్యవేక్షణలో ప్రతిరోజు షెడ్యూల్ మేరకు కోర్టులో జరుగుతున్న కేసు ట్రైల్ పురోగతిపై సమీక్ష నిర్వహించే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. దీని ద్వారా ఈ సంవత్సరం తీవ్రమైన నేరాల నమోదు శాతంలో గణనీయంగా అదుపు చేయడం జరిగింది. కన్విక్షన్ బేస్ పోలీసింగ్ విధానాన్ని గత సంవత్సరం(2022) నుండి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నాము. ఈ విధానం ద్వారా నేరాల తీవ్రత ఆధారంగా గత సంవత్సరంలో గుర్తించిన 165 కేసుల్లో న్యాయస్థానాలలో విచారణ ప్రక్రియ పూర్తి చేసుకొని నూటికి 100? శాతం నిందితులకు శిక్షలు విధించిన కోర్టులు. అదేవిధంగా పోలీస్ శాఖలోని వివిధ విభాగాలైన అవినీతి నిరోధక శాఖ, సిఐడి, గ్రేహౌండ్స్, ఆక్టోపస్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, ఇంటలిజెన్స్, ఏపిఎస్పి బెటాలియన్స్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో(ఎస్ఈబి) విభాగాలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది వివరాలను సేకరించడం జరుగుతుంది. త్వరలోనే వారికి కూడా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిజిపి డిస్క్ అవార్డులను అందించడం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందికి ప్రోత్సాహకరంగా ఉండేందుకే ఈ అవార్డులను అందించడం జరుగుతుంది.

# భారత జట్టులోనూ 'వై నాట్ ఏపీ'.. సీఎం జగన్ విజన్!





విజయవాడ,డిసెంబర్16"పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి చదువే"... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ చెప్పే మాట. ఓట్లు వేసిన 'పెద్దోళ్ల'కు ఇచ్చిన హామీలే నెరవేర్చని నాయకులు ఉన్న ఈరోజుల్లో..ఓటు హక్కులేని పిల్లల గురించే ఎక్కువగా ఆలోచించడం ఆయనకే చెల్లింది.నేటి బాలలే.. రేపటి పౌరులు కదా.. అందుకే చిన్ననాటి నుంచే వారిని మెరికల్లా తీర్చిదిద్దడంతో పాటు.. అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించేలా ఇప్పటికే విద్యా వ్యవస్థలో ఆంగ్ల మాధ్యమం వంటి పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. బాలల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నారు. అంతేకాదు.. నాడు– నేడు పేరిట పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు.అదే విధంగా చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి ఉన్న యువత ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో ఉన్నారు సీఎం జగన్. అందుకు అనుగుణంగా "ఆడుదాం ఆంధ్రా" పేరిట సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కీలకమైన ప్రతీ క్రీడాంశంలో భాగమైన భారత జట్టులో 'వై నాట్ ఏపీ' అనే స్థాయికి ఎదగాలంటే క్షేత్రస్థాయి నుంచే బలమైన పునాదులు పడాలన్న తలంపుతో ముందుకు సాగుతున్నారు.అంబటి రాయుడు, పీవీ సింధు, జ్యోతి సురేఖ, హనుమ విహారి, జ్యోతి యర్రాజీ, కోన శ్రీకర్ భరత్, సాత్విక్ సాయిరాజ్‌లా తాము తమకిష్టమైన స్పోర్ట్‌లో రాణించాలనుకునే వాళ్ల కోసమే ఈ క్రీడా సంబరాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా.. క్రికెట్, ఖో ఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ వంటి ఐదు క్రీడాంశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోటీలు నిర్వహించనుంది.ఇందుకోసం ఇప్పటికే ముప్పై లక్షలకు పైగా మంది ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం విశేషం. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడిచే మెగా ఈవెంట్లో మండల, మున్సిపల్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం.. క్రీడాకారులకు రూ. 41.43 కోట్ల విలువైన ఐదు లక్షల స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది కూడా!వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులతో పాటు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకువస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించడంలో సీఎం జగన్ ముందు వరుసలో ఉంటారు. ఆర్చరీలో ఇప్పటికే ఎన్నో అంతర్జాతీయ పతకాలు సాధించిన విజయవాడ అమ్మాయి వెన్నం జ్యోతికి సురేఖకు డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది జగన్ ప్రభుత్వం.గత సర్కారు పాలనలో జ్యోతి సురేఖ ప్రతిభకు తగిన గుర్తింపు దక్కలేదన్న విషయాన్ని గుర్తించి.. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం ఇచ్చింది. అదే విధంగా రెండుసార్లు ఒలింపిక్ పతకం సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధును సముచిత రీతిలో గౌరవించింది. అదే విధంగా.. వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా అండగా ఉంటోంది.


# కృష్ణా జిల్లాలో దారుణం

**ఆస్తికోసం తండ్రి దారుణ హత్య**

విజయవాడ,డిసెంబర్16 : కృష్ణా జిల్లా నాగలంక మండలంలో దారుణం చోటు చేసుకుంది. కనిపెంచిన తండ్రిని ఆస్తి కోసం కుమారుడు దారుణంగా హత్య చేశాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని భావదేవర పల్లిలో కూలి చేసి బతుకుతున్న బండి హరి మోహన్‌రావు భార్య కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయింది. దీంతో అతడు కుమారుడు పవన్ కల్యాణ్ వద్ద ఉంటున్నాడు. అయితే ఆస్తి కోసం తండ్రి, కొడుకు మధ్య కొన్ని రోజులుగా వాగ్వాదం జరుగుతుంది. శుక్రవారం రాత్రి మంచం మీద పడుకున్న తండ్రిని దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహంపై డిజీల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయాడు.

# తుక్కుతుక్కుగా ఓడిస్తాం.. బాబు అది ఫిక్స్ అయిపోయారు: మంత్రి అంబటి

తాడేపల్లి: లోక కళ్యాణం కోసమే టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్నాయని చంద్రబాబు అంటున్నారని, జైలుకు వెళ్లొచ్చాక ఆయనకు మతిస్థిమితం పోయినట్లుందని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. శనివారం తాడేపల్లిలో అంబటి మీడియాతో మాట్లాడారు. 2014–19 మధ్య చేసినట్టుగానే అద్భుతంగా పని చేస్తానని చంద్రబాబు ఎందుకు చెప్పటం లేదని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌ను ఎందుకు వెంట పెట్టుకుని రావాలనుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.'సింగిల్‌గా పోటీ చేసే ధైర్యం చంద్రబాబుకు లేదా? 175 సీట్లు మా టార్గెట్. టీడీపీ, జనసేనని తుక్కుతుక్కుగా ఓడించే లక్ష్యంతో పని చేస్తున్నాం. 60% పైగా ప్రజలు మళ్ళీ జగనే కావాలంటున్నారు. మా మార్పుల గురించి అడుగుతున్నారు సరే.. మరి చంద్రబాబు రాజకీయ అరంగేట్రం చేసిందెక్కడ? చంద్రగిరిలో చిత్తుగా ఓడిపోయాక కుప్పం ఎందుకు పారిపోయారు? మీ చిత్తూరు జిల్లాని కాదని లోకేషన్ మంగళగిరి లో ఎందుకు పోటీ చేయించారు' అని అంబటి ప్రశ్నించారు.'బాలకృష్ణ స్వస్థలం గుడివాడ కదా? మరి హిందూపురం ఎందుకు వెళ్లారు? పురంధేశ్వరి ఎందుకు సీట్లు మారుతున్నారు? వచ్చే ఎన్నికల తర్వాత చంద్రగిరి, మంగళగిరి వదిలి అబ్బాకొడుకులు శంకరగిరి మాణ్యాలకు పోవాల్సిందే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు గౌరవం కల్పించింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. మా పరిపాలన చూశాక ఇక జీవితంలో అధికారం రాదని చంద్రబాబు ఫిక్స్ అయ్యారు. యువగళం ద్వారా లోకేష్ ఏమైనా నాయకుడయ్యాడా? రాజకీయంగా ఏమైనా ఎదిగాడా? యువగళం అట్టర్ ఫ్లాప్ అయింది' అని అంబటి అన్నారు.'పవన్ కళ్యాణ్‌కు ఎన్ని సీట్లు ముష్టి వేస్తున్నారో చెప్పాలి? గతంలో మీరు కలిసి పోటీ చేసి ఎందుకు విడిపోయారు? మీది కలహాల కాపురం అని తేలి పోయింది. చంద్రబాబు, పవన్, లోకేష్ అసలు ఎక్కడ ఉంటారు? సీఎం ఐతేనే చంద్రబాబు అసెంబ్లీ కి వస్తారా?



# దివాళాకోరు రాజకీయాలు



- రాష్ట్రం దివాళా తీయలేదు
- ఢిల్లీ నామినేట్ చేసిన వ్యక్తి సీఎం అయ్యారు
- గడిచిన పదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి
- గవర్నర్ ప్రసంగంలో సత్యదూరమైన మాటలు
- అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన బీఆర్ఎస్
- గత కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు, ఆకలి కేకలు
- ఇందిరమ్మ రాజ్యంలో గంజి కేంద్రాల దుస్థితి
- గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేదు
- ఎక్కడ చూసినా మంచినీటి సమస్యలు ఉండేవి
- శాసనసభ సమావేశాల్లో కేటీఆర్?
- గవర్నర్ ప్రసంగంపై అసెంబ్లీలో వాడీవేడీ' చర్చ

హైదరాబాద్,డిసెంబర్16 : తెలంగాణ ప్రజలు ఎన్నుకున్న వ్యక్తి కాకుండా, ఢిల్లీ నామినేట్ చేసిన వ్యక్తి సీఎం అయ్యారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వచ్చిన ప్రభుత్వం అప్పుల గురించి మాట్లాడుతుంది కానీ, ఆస్తుల గురించి మాట్లాడటం లేదని పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం అప్పులు చేశామని, సంపద సృష్టించామని కేటీఆర్అసెంబ్లీలో పేర్కొన్నారు. రాష్ట్రం దివాళా తీయలేదని, దివాళాకోరు రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగంలో సత్యదూరమైన మాటలు కనిపించాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన ఉంటామని స్పష్టం చేశారు. గత కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు, ఆకలి కేకలు తప్ప మరేమి లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ పాలన తెస్తామని కాంగ్రెస నేతలు మాట్లాడుతున్నారని ఇందిరమ్మ రాజ్యంలో గంజి కేంద్రాల దుస్థితి వచ్చిందన్నారు. గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేదు, మంచినీటి సమస్యలు ఉండేవని, నల్గొండలో ఫ్లోరైడ్ బాధలు, దేవరకొండలో పసిపిల్లల అమ్మకాలు, పాతబస్తీలో మైనార్టీ తీరని బాలికల వివాహాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ సభ్యులు మిడిసిపడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 24 గంటల కరెంట్ కోసం అప్పులు చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక్క ఏడాది కూడా క్రాప్ హాలీడే ఇవ్వని ఘనత కేసీఆర్‌కు దక్కుతుంది. మా పాలనలో అప్పులు గురించే చెప్తున్నారు.మేము సృష్టించిన ఆస్తుల గురించి చెప్పట్లేదు. గవర్నర్ ప్రసంగంలో పౌరసరఫరాల శాఖ గురించి అబద్ధాలు చెప్పారు. నిరుద్యోగుల అంశంలో ఆత్మహత్యలు తక్కువ ఉన్న రాష్ట్రం తెలంగాణ అని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగంలో రాష్ట్రం నంబర్ వన్‌గా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యుత్ ప్లాంట్లు కట్టడం తప్పా అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ట్రాన్స్‌కో ఆస్తులు రూ.24,470 కోట్లు, జెన్‌కో రూ.53,963 కోట్లు సృష్టించాం. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తి చేయాలని కోరుతున్నాం. రాష్ట్రంలో అప్పుల కంటే ఆస్తులు ఎక్కువగా ఉన్నాయి. రూ.1,37,571 కోట్ల ఆస్తులు సృష్టించాం. అప్పులు చూపించి గృహజ్యోతి పథకం నుంచి తప్పుకోవాలని చూస్తున్నారు. తెలంగాణ ప్రజలు ఎన్నుకున్న వ్యక్తి కాకుండా ఢిల్లీ నామినేట్ చేసిన వ్యక్తి సీఎం అయ్యారని కేటీఆర్ దుయ్యబట్టారు. పదేళ్లలో మహబూబ్‌నగర్‌లో వలసలు ఆగిపోయాయి. ఎన్ఆర్ఐలకు టికెట్లు అమ్ముకున్నది ఎవరో చెప్పాలి?. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని హామీలను అమలు చేయాలి. మేము స్వాగతిస్తాం. కోటిన్నర మంది మహిళల ఖాతాలో రూ.2,500 వేస్తారన్నారు. రూ.2,500 ఖాతాలో ఎప్పుడు వేస్తారో అని మహిళలు వేచి చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని హామీలు అమలు చేస్తే స్వాగతిస్తామన్నారు. ఎన్‌కౌంటర్ పేరిట హత్యలు చేసింది ఎవరో చెప్పాలి. ఆనాడు చర్చల కోసం నక్సలైట్లను పిలిచి చంపింది ఎవరో చెప్పాలి. విద్యుత్ రంగం గురించి చాలా చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో పదేళ్ల పాలన గురించి శ్వేతపత్రం విడుదల చేశామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మత్స్య సంపద పెంచేందుకు.. ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్‌లో 10 లక్షల చేప పిల్లల విడుదల

విజయవాడ,డిసెంబర్16 మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఏపీ సర్కార్ చర్యలు చేపట్టింది.. ఇందులో భాగంగా భవానిపురం ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్లో చేప పిల్లలను విడుదల చేశారు అధికారులు.మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు రిజర్వాయర్లో మత్స్యసంపద ఉత్పత్తి , ఉత్పాదకత పెంచటానికి ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్ లో 10 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. ఇవే కాకుండా ఈ నెల ద్వారా సహజంగా ఉత్పత్తి అయ్యే మత్స్య సంపదకు తోడు విడుదల చేసిన చేపలు కూడా పెరిగి రిజర్వాయర్లోనూ, నదుల్లోనూ మత్స సంపద వృద్ధి అవుతుంది. తద్వారా మత్స్యకారులు దీని ద్వారా లాభం పొందనున్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఎన్టీఆర్ జిల్లాకి 25.5 లక్షల చేప పిల్లలను కేంద్రం మంజూరు చేసింది.



# యువగళం సభకు 6లక్షల మంది రాక

**పవన్ కళ్యాణ్ రావడం లేదన్న అచ్చన్న**

అమరావతి,డిసెంబర్16 ): భోగాపురం మండలం పోలిపల్లి సమీపంలోని భూమాత లేఅవుట్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించే యువగళం పాదయాత్ర ముగింపు సభకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రావడం లేదని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 20వ తేదీన పోలిపల్లి గ్రామంలో యువగళం పాదయాత్ర ముగింపు సభ నిర్వహించనున్నారు. ఆ సభకి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు. నారా లోకేష్ పాల్గంటారు. ఈ సభకి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది కార్యకర్తలు హాజరుకానున్నారు. ఈ సభకి 16 కమిటీలు ఏర్పాటు చేశాం. ఈ సభకి 6 లక్షలు మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నాం. వైసీపీ కౌట్ డౌన్ ప్రారంభమైంది. వైసీపీలోని అనేకమంది టీడీపీలో చేరడానికి రెడీ అవుతున్నారు. ఇది యువగళంలో భాగంగానే జరుగుతుంది.

# సంపాదకీయం

ఆదివారం 16-12-2023

## మోడీ ఛరిష్మా ముందు కాంగ్రెస్ నిలవగలదా !

పార్లమెంట్ ఎన్నికలకు ఇక ఎంతో దూరం లేదు. ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రతిష్టాకమమైనవి. ఎందుకంటే ఉత్తరాదిలో కాంగ్రెస్ మెల్లగా ఊడ్చి పెట్టుకుని పోతోంది. మొన్నటికి మొన్న మూడు రాష్ట్రాల్లో ఓటమి పాలయ్యింది. ఈ ఫలితాల తరవాత ఇండియా కూటమిపై అనుమానాలు మొదలయ్యాయి. మరోవైపు ఈ ఫలితాలతో మోడీ మరోమారు తన విశ్వపాన్ని చూపారు. దేశంలో ఇప్పుడు మోడీని ఢీకొనడమెలా అన్న సందిగ్ధంలో విపక్షాలు తప్పటడుగులు వేస్తున్నాయి. సంస్థాగత పటిష్ఠత, అపారమైన ఆర్థిక వనరులు, సైద్ధాంతిక స్పష్టత అనేవి ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడంలో బీజేపీకి ఎనలేని స్థాయిలో తోడ్పడింది. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉండడంతో పాటు పోలింగ్ బూత్ స్థాయిలో నిబద్ధుల యిన కార్యకర్తలు సైతం పెద్ద సంఖ్యలో ఉండడం బిజెపికి కలసి వస్తోంది. అదే ఇటీవలి మూడు రాష్ట్రాల్లో గెలుపునకు తోడ్పడింది. తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్నా స్వయంకృతం వల్ల పోగొట్టు కుంది. అయితే సంస్థాగతం గా బిజెపి బలంగా ఉండడం, మోడీ ఆకర్శణ కారణంగా కాంగ్రెస్‌కు పదేళు గా గడ్డుపరిస్థితిని ఎదుర్కొం టోంది. ప్రధానంగా నాయకత్వ సమస్య కూడా కాంగ్రెస్‌ను కునరాలిల్ల చేస్తోంది. ఈ క్రమంలో రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో మోడీని ఎలా ఢీకొంటారన్నదానికి స్పష్టత లేదు. కాంగ్రెస్‌లోనే అలాంటి ధైర్యం ఉన్న నేతలు లేరు. అలాగే ధైర్యంగా ముందుకు వెళ్లేలా పటిష్ట నాయకత్వం లేదు. పటిష్ట మైన కార్యకర్తల బలం ఉండడం, సామాజిక మాధ్యమాల ద్వారా ఓటర్లతో నిరంతర సంబంధాలను కలిగి ఉండడం బిజెపికి కలసి వస్తోంది. కార్యకర్తల బలిమితో సమాజంలోని అట్టడుగుస్థాయి ఓటర్లతో కూడా బీజేపీ పటిష్ఠ సంబంధాలను కలిగివుంది. బలమైన పునాది ఉన్నందువల్ల కొన్ని ప్రాంతీయ పార్టీలకు కూడా కార్యకర్తల బలం అపారంగా ఉండడం వల్లే ప్రజల్లో నిలదొక్కుకుని ఆయా రాష్ట్రాల్లో అధికారంలో కొనసాగు తున్నాయి. ఇటీవలి కాలంలో కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం బలహీనపడడంతో అంతర్గత వివాదాల కారణం గా అనేకులు పార్టీని వీడారు. అలా గులాంనబీ ఆజాద్, కపిల్ సిబల్ లాంటి వారు బయటకు వచ్చారు. రాజస్థాన్‌లో గెహ్లోత్, పైలట్‌ల మధ్య అధికార కుమ్మలాటలను నివారించడంలో కాంగ్రెస్ అధిష్ఠానం వైఫల్యం కారణంగానే అక్కడ ఓటమి చెందింది. ఛత్తీస్‌గఢ్‌లో భూపేష్ బాఘేల్, టిఎస్ సింగ్‌దేవ్‌ల మధ్య వివాదాలను పరిష్కరించడంలో కూడా కాంగ్రెస్ నాయకత్వం విఫలమయింది. అందుకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించింది. అందుకే మూడు రాష్ట్రాల్లో గెలిచిన తరవాత బీజేపీలో మోదీ ఆరాధన మరింత పెరిగిపోయిం దనడంలో సందేహం లేదు. ఈ విజయాలు, నాయకత్వ పటిమనే బీజేపీని ప్రత్యర్థి పక్షాల కంటే భిన్నంగా నిలబెడుతున్నాయి. కొత్త ముఖ్యమంత్రుల ఎంపికలో బిజెపి అధిష్ఠానవర్గం అధికార దర్పానికి తార్కాణం కావచ్చు. పాత నాయకులను పక్కన పెట్టడం, కొత్త నేతలకు అవకాశం కల్పించడంలో అనుసరిస్తున్న పద్ధతులు ఆమోదయోగ్యమైన ఫలితాలనిస్తున్నాయి. మరీ ముఖ్యంగా హిందూత్వ స్ఫూర్తిని చక్కగా ఉపయోగించుకోవడం జరుగుతోంది. యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వశర్మ లాంటి సిఎలు బలంగా ఎదగడానికి విశేషంగా దోహదం చేశాయి. అంతేకాకుండా బీజేపీ తన నాయకత్వ శ్రేణుల్లో క్రమంగా తరం మార్పునకు సంసిద్ధమవుతున్న వైనానికి అవి నిదర్శనాలుగా కనిపిస్తున్నాయి. మహా శక్తిమంతమైన బీజేపీ ఎన్నికల యంత్రాంగాన్ని నిలువరించి నిలబడం కూడా కాంగ్రెస్‌కు కష్టమే. ఎన్నికలలో పై చేయి సాధించడమనేది కాంగ్రెస్‌కు అసాధ్యంగా ఉన్నది. బీజేపీకి దీటుగా సొంత సమాంతర ఎన్నికల నిర్వహణ వ్యవస్థ లేకపోవడమేనని చెప్పి తీరాలి. ముఖ్యంగా హిందీ రాష్ట్రాల్లో క్షేత్ర స్థాయిలో ప్రజలను సమీకరించడంలో బీజేపీ శక్తిసామర్థ్యాలు కాంగ్రెస్‌కు అంతుచిక్కకుండా ఉన్నాయి. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న తీరు తెన్నులు పూర్తిగా భిన్నమైనవి. ప్రచారఘట్టం తుదిదశలో పార్టీ జాతీయనాయకుల సభలతో ఓటర్లను ఆకట్టుకునే రోజులు గతించాయి. ఓటర్లతో ఆన్‌లైన్ ద్వారాగానీ, వాట్సాప్ గ్రూపుల ద్వారాగానీ లేదా విలక్షణ పంథాను అలవర్చుకోవడం ద్వారా బంధాలను పటిష్టం చేసుకుంది. ఇప్పుడు ఎన్నికల వ్యవహారాలలో బిజెపి పటిష్టమైన విధానాన్ని పద్ధతిని కలిగివుంది. ప్రధాని మోదీ, పోలింగ్ బూత్ స్థాయి బీజేపీ కార్యకర్తలతో నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించ గలుగుతున్నారు. కార్యకర్తలతో నిరంతర సంస్థాగత సంబంధాలను నెరపడమెలాగో కాంగ్రెస్ నేర్చుకోవలసి ఉంది. దశాబ్ద కాలంగా మోదీ ప్రజాకర్షణ శక్తి బీజేపీకి ఒక స్పష్టమైన, సుస్థిరమైన అనుకూలతను నెల కొల్పింది. ఇందిరాగాంధీ అనంతరం అఖిల భారత స్థాయిలో తిరుగులేని నేతగా వెలుగొందుతూ తన వ్యక్తిగత ప్రభావంతో రాష్ట్రాల ఎన్నికలలో సొంత పార్టీకి గణనీయమైన విజయాలను సాధించిపెడుతున్న ఏకైక నాయకుడు నరేంద్ర మోదీయే. ముఖ్యంగా హిందీ రాష్ట్రాల్లో ఆయనకు లభ్యమవుతున్న ప్రజాదరణ అనూహ్యం.మోదీ మాటను ప్రజలు సంపూర్ణంగా విశ్వసిస్తున్నారు. ఇచ్చిన హామీలను ఆయన తప్పక నెరవేరుస్తారని గట్టిగా నమ్ముతున్నారు. ఈ కారణంగానే ఓటర్లు ఆయన పార్టీని ప్రతీ ఎన్నికలలోనూ బలపరుస్తున్నారు. బీజేపీ ప్రభుత్వాలపై, ముఖ్యంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలపై స్థానికంగా ఉన్న వ్యతిరేకతను అధిగమించేందుకు మోదీ ప్రభావం అమితంగా దోహదం చేస్తోంది.

## కోడుమూరు వికసిత్ భారత్ సంకల్పయాత్ర





విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి డిసెంబర్ 16 :కర్నూలు జిల్లా కోడుమూ రు అసెంబ్లీ ఇన్ చార్జ్ వేల్పులగోపాల్ మాట్లాడుతూ కోడుమూరు నగరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో కేంద్రమంత్రి దేవుసిన్హ్ చౌహాన్ పాల్గొని మాట్లాడుతూ మన భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిర్వహించిన వీడియో కన్ కాన్ఫ రెంట్ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వికసిత్ భారత్ సంకల్ప యాత్రను అధికారులు ప్రజా ప్రతినిదులు నాయకులు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. మన భారత ప్రధానమంత్రి శ్రీనరేంద్రమోడీ ప్రవేశపెట్టినటువంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు గనుక గ్రామంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోగలరని విన్నవించుకుంటు న్నమన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులుకునిగిరినీలకంఠ రాష్ట్రనాయకులుపార్థసారధి చంద్రమోలి వినిషారెడ్డి విట్టరమేష్ మురళినాయుడు మల్లేష్ నాయుడు ప్రేమ్ కుమార్ మీడియా కన్వీనర్ రాఘవేంద్ర కోడుమూరు మండలాల అధ్యక్షులు షణ్ముఖఅచారిబెస్తఈరన్నదెవన్నరాజశేఖర్అశోక్శ్రీనుకిరణ్నటరాజ్నాగేశ్వరరెడ్డిభగత్ నిలప్ప మహిళా నాయకురాలు మాలతి గీతామాధురిజ్యోతిలక్ష్మి మహిళలకు మూడు కోట్ల 30 లక్షల రూపాయల చెక్కును మహిళలకు అందజేశారు.

## కళ్ళకు గంతలతో నిరసన..






విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 16 సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల నిరవధిక సమ్మె 5వ రోజు డోన్ పట్టణంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం టెంటుదగ్గర శనివారం కొనసాగింది.సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్,ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కోయిలకొండ నాగరాజు,ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు సులోచన,రహమద్బి, సుమలత,ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉద్యమ ముద్దుబిడ్డ,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ,యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు షేక్ సాబ్జి గారి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతిమ ఘడియల్లో సైతం కార్మిక వర్గం సేవలోనే గడిపిన షేక్ సాబ్జి గారు భౌతికంగా దూరమవడం అత్యంత విషాదకరమని,ఉద్యమానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.వారు దూరమైనా వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.అనంతరం దీక్షా శిబిరంలో కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఇంతలో ఎస్సీ కాలనీలోని 13వ అంగన్వాడి కేంద్రం తాళాలను సచివాలయం సిబ్బంది బలవంతంగా బ్రద్దలు కొట్టడానికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారం అందడంతో సిఐటియు నాయకులు,అంగన్వాడీ నాయకులు టీచర్లు,ఆయాలు 13వ అంగన్వాడీ కేంద్రం దగ్గరకు చేరుకొని అక్కడ బైఠాయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు,ఆయాలు సమస్యల పరిష్కారం కొరకు గత 5 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మీదకు వచ్చి నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వారన్నారు. అంగన్వాడీల సమ్మెను అక్రమ కేసులతో,నిర్బంధాలతో,బెదిరింపులతో అంగన్వాడీలను భయ భ్రాంతులకు గురిచేసి సమ్మెను అణిచివేయవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం పగటి కలలు కంటున్నట్లు కనిపిస్తున్నదని అందులో భాగమే బలవంతంగా అంగన్వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టి సచివాలయాలకు అప్పగించి వాటి పర్యవేక్షణలో వాలంటీర్ల ద్వారా అంగన్వాడీ కేంద్రాలను నడపాలన్న కుటిల పన్నాగం పన్నుతున్నదని ప్రభుత్వ ధోరణి చూస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు అంగన్వాడీలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం చేతకాక అణచివేత చర్యలకు దిగడం ఉత్తుత్తి వాగ్దానాలతో అంగన్వాడీలను మోసం చేయడం కాదా అని వారు ప్రశ్నించారు.అక్రమ కేసులతో,అణచివేత విధానాలతో ఉద్యమాలను ఆపలేమన్న విషయాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా గ్రహించాలని సమస్యలను చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించాలని లేనియెడల గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ నియంత ప్రభుత్వానికి పట్టక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల వల్ల అంగన్వాడీలు గత్యంతరం లేని పరిస్థితులలో నిరవధిక సమ్మెలోకి రావలసి వచ్చిందని సమ్మె వల్ల లబ్ధిదారులకు కలిగే ఇబ్బందులకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

## సచివాలయ పోలీసులను అనవసరంగా నిందించవద్దు :జిల్లా అధ్యక్షులు మాదవిలత

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 16 - రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడి వర్కర్స్ మరియు హెల్పర్స్ వారి కనీస డిమాండ్స్ నెరవేర్చాలని సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయంగా సచివాలయం సిబ్బందినీ నియమించింది. ప్రభుత్వఉద్యోగులుగా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తున్న సచివాలయం సిబ్బంది,మహిళ పోలీసుల పట్ల ఇబ్బంది కరంగా మాట్లాడుతూ తీవ్ర పదజాలంతో దూషిస్తూ అగౌరవంగా మాట్లాడుతూ కొన్ని చోట్ల దాడులు కూడా చేస్తున్న అంగన్వాడీకార్యకర్తలు మరియు హెల్పర్స్ యొక్క వాఖ్యల్ని,చర్యల్ని ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డ్ సచివాలయ మహిళ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంఘ రాష్ట్ర ప్రెసిడెంట్ మహలక్ష్మి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైత్ర శ్రీజ రెడ్డి, జిల్లా ప్రెసిడెంట్ మధులత, జనరల్ సెక్రెటరీ విజయలక్ష్మి మరియు నంద్యాల జిల్లా అసోసియేషన్ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 16 :నంద్యాల పట్టణంలో సచివాలయ సిబ్బందితో శనివారం మున్సిపల్ కార్యాలయం యందు నిర్వహించిన సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. సచివాలయ సిబ్బంది కి తగు సూచనలు చేశారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ బయోమెట్రిక్ హాజరునురోజుకు మూడు సార్లు ప్రతిరోజుఉదయం 10:30 గంటల లోపు,తర్వాత మధ్యాహ్నం 2:30 నుండి3.00 గంటల మధ్య స్పందననిర్వహణ కోసం, సాయంత్రం5.00 గంటల తర్వాత చివరిగానమోదు చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పథకం ద్వారా ప్రజలకు సత్వరమే సేవలు అందించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా కొంతమంది సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తూ గైరుహాజరు కావడం జరుగుతోందన్నారు. స్పందనకు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన రాబడిని తప్ప కుండా వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు. శానిటరీ సెక్రటరీలు. అమెనిటీస్. తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల,డిసెంబర్16 : వైష్ణవాలయాల సంప్రదాయాలను పాటిస్తూ తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23 నుండి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వారం 10 రోజుల పాటు తెరచి ఉంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. వైకుంఠ ఏకాదశికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పురాణాల ప్రకారం వైకుంఠ ద్వార దర్శనం విశిష్టత ఇలా ఉంది. వైకుంఠంలో శ్రీమహావిష్ణువుకు ఒక రోజు అంటే భూలోకంలో ఒక సంవత్సరం అని అర్థం. అదేవిధంగా అక్కడ పగలు 12 గంటలు ఇక్కడ 6 నెలలు ఉత్తరాయణం, రాత్రి 12 గంటలు ఇక్కడ 6 నెలలు దక్షిణాయణం. సంవత్సరంలో ఒకసారి జరిగే పక్రియగా కనిపిస్తుంది.- రోజులలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటే శ్రీమహావిష్ణువును ప్రత్యక్షంగా దర్శనం చేసుకున్న భాగ్యం కలుగుతుంది అనేది నమ్మకం. కాబట్టి వైకుంఠ ద్వార దర్శనం ఈ 10 రోజులలో ఏరోజు చేసుకున్నా అన్ని రోజులూ సమానమే. భక్తులు ఈ విషయాన్ని గమనించి దర్శనానికి రావాల్సిందిగా విజ్ఞప్తి.- తిరుమలలో గదులు పరిమితంగా ఉన్న కారణంగా ఈ పర్వదినాలలో భక్తుల రద్దీ దృష్ట్యా తిరుపతిలో గదులు పొందాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

## ఎన్నికల కురుక్షేత్రంలో ఎందాకైనా సిద్ధమే

### నంద్యాల అసెంబ్లీ ఇంచార్జ్ ఎన్ఎండి ఫరూక్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 16 :ఎన్నికల కురుక్షేత్రంలో ఎందాకైనా సిద్ధమేనని నంద్యాల అసెంబ్లీ ఇంచార్జ్ ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్ఎండి ఫరూక్ఆధ్వర్యంలో పట్టణంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఫరూక్ మాట్లాడుతూ విస్తృత స్థాయి సమావేశం ద్వారా నాయకులను కార్యకర్తలను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని, గతంలో నంద్యాల ప్రజల సహాయ సహకారాలతో, ప్రేమ, అభిమానాలతో మూడు దఫాలు ఎమ్మెల్యేగా గెలిచి ఎన్నో ఉన్నత పదవులు అలంకరించి నంద్యాలకు సేవ చేసే భాగ్యం కల్పించారని, ఇరవై సంవత్సరాల తరువాత మళ్ళీ నాపై నమ్మకంతో నంద్యాల అసెంబ్లీ సీటును కేటాయించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల కోసం తమ సొంత ఆస్తులను సైతం త్యాగం చేసిన చరిత్ర మాదని, నేను చేసిన అభివృద్ధి మీ కళ్ళకు కనబడుతుందని, వలసవాదులను నమ్మవద్దన్నారు. నంద్యాల ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఎటువంటి కష్టం వచ్చినా తోడుగా ఉంటానని, ఎవరు ఆధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. మూడు నెలల్లో అధికారంలోకి రాబోతున్నామని, అందరి సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల కురుక్షేత్రంలో ఎందాకైనా సిద్ధమేనని ఎక్కడ కూడా తగ్గేదే లేదని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి విజయవంతంగా తీసుకెళ్లాలని బూత్, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ లకు దిశా నిర్దేశం చేశారు. అదే క్రమంలో ఈ నెల 20వ తేదీన భోగాపురం మండలం పొలిపల్లిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం ముగింపు సభ ద్వారా ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తామని, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభలో మాట్లాడిన మాజీ ఆర్ఐసి చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి ఫరూక్ సౌమ్యుడని, గతంలో నంద్యాల పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ఫ్యాక్షన్ లకు, దౌర్జన్యానికి తావు లేకుండా పనిచేసిన ఫరూక్ ను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మాజీమంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్సులు రామచంద్రరావు, ఏవిఆర్ ప్రసాద్, నాయకులు డాక్టర్ బాబన్, తులసిరెడ్డి, మనియర్ ఖలీల్, వాహిద్ హుస్సేన్, చింతల సుబ్బారాయుడు, పోతుల రవి, కౌన్సిలర్ దూదేకుల జైనాబీ, జనసేన నాయకులు చందు, సురేష్ తో పాటు మాజీ కౌన్సిలర్లు మిద్దె హుసేని, రవికుమార్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు

## రీ ఎంట్రీ లగడపాటి..



గుంటూరు, డిసెంబర్ 16, లగడపాటి రాజగోపాల్. తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితమైన పేరు. విజయవాడ ఎంపీగా, ఆంధ్రా ఆక్టోపస్‌గా పేరు తెచ్చుకున్నారు. అయితే 2018లో జరిగిన తెలంగాణ ఎన్నికలు, 2019లో జరిగిన ఏపీ ఎన్నికల ఫలితాల తర్వాత పూర్తిగా రాజకీయా లకు దూరంగా ఉన్నారు. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటున్నాని కూడా ప్రకటించారు. అప్పడప్పుడు ఏదైనా ప్రైవేట్ కార్యక్రమాల్లో మాత్రం కనిపిస్తున్నారు.. ం ఇప్పుడు తాజాగా లగడపాటి పాలిటిక్స్ లోకి రీ ఎంట్రీ ఇస్తున్నారని సమాచారం. వచ్చే ఆంధ్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని లగడపాటి నిర్ణయం తీసుకున్న ట్లుగా తెలుస్తోంది. టీడీపీ నుంచి రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు చెబుతున్నారు. జయదేవ్ రాజకీయాలకు గుడ్ బై చెబుతా రని వార్తలు వస్తున్న నేపథ్యంలో?అక్కడ నుంచే లగడపాటి ఎంపీగా పోటీ చేస్తారని చెబుతున్నారు. ఈయనకు గల్లా మద్దతు ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. గుంటూరులో గల్లా రెండు పర్యాయాలుగా గెలుస్తున్నారు. ఇప్పుడు ఆయన వెళ్ళిపోయాక కూడా లగడపాటి ద్వారా గుంటూరు ఎంపీ స్థానాన్ని మరోసారి గెలవాలని అనుకుంటోంది టీడీపీ.

## ఎవరిది వాపు.... ఎవరిది బలుపు

నెల్లూరు, డిసెంబర్ 16, ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. పట్టుమని మూడు నెలల వ్యవధి కూడా లేదు. గెలుపు కోసం అన్ని పార్టీలు వ్యూహాలు రూపొందిస్తున్నాయి. ఈ తరుణంలో విజేత ఎవరు అన్నది? రోజురోజుకు జఠిలంగా మారుతోంది. ఒంటరి పోరుకు వైసీపీ సిద్ధపడుతుండగా.. టిడిపి,జనసేన కూటమి కడుతున్నాయి. దీంతో హోరాహోరీ ఫైట్ తప్పదని సంకేతాలు ఇస్తున్నాయి .దీంతో బలమైన నాయకుడు ఎవరు? బలహీనులు ఎవరు? అన్న చర్చ నడుస్తోంది. మధ్యలో నేషనల్ మీడియాల సర్వేలు సెగలు పుట్టిస్తున్నాయి. రాష్ట్రవ్యా ప్తంగా అభ్యర్థులను మార్చి.. కొత్తవారిని రంగంలోకి దించి రెండోసారి విజయం కోసం జగన్ ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యా ప్తంగా 70 నియోజకవర్గాలను మార్చాలని భావిస్తున్నారు. అయితే ఇందులో సాహసం కనిపిస్తున్నా.. అంతకంటే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయప ్డుతు న్నారు. ఒకవేళ టిక్కెట్లు దక్కని వారు పార్టీపై అభిమానంతో పని చేస్తే పర్వాలేదు కానీ.. ఇతర పార్టీల్లోకి ఫిరాయించి.. కొత్త అభ్య ర్థులను ఓడిస్తే అసలు లక్ష్యానికి ఎసరు వస్తుందని.. అప్పుడు నా యకత్వం అచేతనంగా మారడం ఖాయమని విశ్లేషణలు వెలువడుతున్నాయి.టిడిపి, జనసేన పొత్తుతో ముందుకు వెళుతున్నాయి. వీటి మధ్య సమన్వయం కుదిరింది. రెండు పార్టీల మధ్య సీట్లు, ఓట్ల సర్దుబాటు సక్రమంగా జరుగుతుందని సంకేతాలు వస్తున్నాయి. పొత్తునకు రెండు పార్టీల శ్రేణులు ఏనాడో మానసి కంగా సిద్ధపడ్డాయి. పొత్తు సహించలే కపోయిన నేతలు బయటకు వెళ్ళిపో యారు. అటు పవన్ సైతం పార్టీ శ్రేణులకు హెచ్చరికలతో కూడిన సూచ నలను చేశారు. పొత్తునకు విఘాతం కలగకుండా ఎటువంటి వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టమైన సంకేతాలు పంపారు. క్షేత్రస్థాయిలో రెండు పరిస్థితుల మధ్య సర్దుబాటు ఆశాజనకంగా ఉంది.ఏపీలో బలం, బలహీనం వైరిపక్షాల్లో కనిపిస్తోంది.

# ౭౦ నియోజకవర్గాల్లో కొత్త ముఖాలు

విజయవాడ, డిసెంబర్ 16, వచ్చే ఎన్నికల్లో కీలక మార్పులు దిశగా వైసిపి అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభ్యర్థులను మార్చనుందని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 11మంది అభ్యర్థులను మార్చింది. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి లాంటి బలమైన నేతను సైతం వదులుకునేందుకు సిద్ధపడింది. దీంతో వైసీపీలో రకరకాల చర్చ ప్రారంభమైంది. కొంతమంది మంత్రులకు సైతం ఉద్వాసన తప్పదని టాక్ నడుస్తోంది. ఇది వైసీపీ నేతల్లో కలవరపాటుకు కారణం అవుతోంది. అటు సోషల్ మీడియాలో సైతం నేతల మార్పు ఇది అంటూ రకరకాల ప్రచారం జరుగుతోంది. ఏకంగా 90 చోట్ల అభ్యర్థులు మారుతారని.. ఆ మేరకు వైసిపి హై కమాండ్ కసరత్తు చేసిందని కూడా కామెంట్స్ వినిపించాయి.వై నాట్ 175 అన్న నినాదంతో వైసీపీ హై కమాండ్ ముందుకు సాగుతోంది. ప్రతి నియోజకవర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఎట్టి పరిస్థితుల్లో గెలుపు గుర్రాలను బరిలో దించాలని చూస్తోంది. ఎటువంటి మొహమాటలకు వెళ్లకుండా జగన్ జాగ్రత్త పడుతున్నట్లు పరిస్థితులు తెలియజేస్తున్నాయి. అయితే అభ్యర్థుల మార్పు వెనుక కీలక నాయకులు మీడియాకు కొత్త కొత్తగా లీకులు ఇస్తున్నారు. ఒక పదిమంది మంత్రులు సైతం సీట్లు కోల్పోనున్నారని వైసిపి అనుకూల మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే ఇది నాయకత్వం వ్యూహాత్మకంగా చేస్తున్న పని అని స్పష్టమౌతోంది. కానీ ఈ ప్రచారం పక్కదారి పడుతోంది. పార్టీలో ఒక రకమైన ఆందోళనకు కారణం అవుతోంది. వైసిపి హై కమాండ్ అలెర్ట్ కాకుంటే తప్పకుండా నష్టం జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 11 మంది అభ్యర్థులను మార్చుతూ వైసిపి హై కమాండ్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో ముగ్గురు మంత్రులకు స్థానచలనం కూడా జరిగింది. అయితే తరువాత ఎవరిపై వేటు వేస్తారా? ఎవరికి స్థాన చలనం కల్పిస్తారా? అన్న చర్చ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 76 నియోజకవర్గాల్లో కొత్త ముఖాలు తెరపైకి వస్తాయని తాజా తెలుస్తోంది. ఎప్పటికే 11చోట్ల అభ్యర్థులు మారారు. 15 మంది సిట్టింగ్ ఎంపీలు ఎమ్మెల్యే అభ్యర్థులుగా మారనున్నారు. మరో 20 మంది ఎమ్మెల్యేలు ఎంపీలుగా పోటీ చేయనున్నారు. మరో 30 మందికి పైగా కొత్తవారు బరిలో దిగనున్నారు. ఇలా వైసీపీలోనే ప్రచారం జరుగుతోంది. వైసీపీకి 151 మంది ఎమ్మెల్యేలు ప్రస్తుతం ఉన్నారు. మరో నలుగురు ఇతర పార్టీల దీంతో వైసీపీ బలం 155 ఎమ్మెల్యేలకు చేరుకుంది. ఈ లెక్కన దాదాపు సగం మంది ఎమ్మెల్యేలను పక్కన పెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ స్థాయిలో టిక్కెట్లు నిరాకరిస్తే మాత్రం పార్టీలో తిరుగుబాటు రావడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే జగన్ అంతటి సాహసం చేస్తారా? లేదా? అన్నది తెలియాలి.

# వైసీపీలో టిక్కెట్ల అలజడి



విజయవాడ, డిసెంబర్ 16, ఎన్నికలకు ముందు ఓ రాజకీయ పార్టీపై అంచనాలు ఎలా ఉన్నాయనేది ఆ పార్టీలో ఉండే చేరికల్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు కొనసాగింది. టిక్కెట్లు రావని తెలిసినా చాలా మంది నేతలు చేరిపోయారు. దీనికి కారణం కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని.. తమకు ఎమ్మెల్యే కాకపోతే మరో పదవి ఇస్తారని ఆశాభావం. ప్రజల్లో ఉన్న మూడ్ రాజకీయ నేతలకు కాక ఇంకెవరికి తెలుస్తుంది...?. తెలంగాణ ఎన్నికలు ముగిసిన తర్వాత ఇప్పుడు ఏపీలో రాజకీయం వేడెక్కుతోంది. ఫిబ్రవరిలోనే ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్న నమ్మకంతో అన్ని రాజకీయ పార్టీలు కార్యకలాపాలు పెంచాయి.వ్యూహాత్మకమో.. వ్యూహాత్మక తప్పిదమో కానీ వైసీపీ చీఫ్ , సీఎం జగన్మోహన్ రెడ్డి అభ్యర్థుల ఎంపికపై త్వర త్వరగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాత్రికి రాత్రి పదకొండు స్థానాల్లో ఇంచార్జుల్ని మార్చేశారు. అంటే వారే అభ్యర్థులని చెప్పినట్లు. .మార్చింది కేవలం 11 చోట్ల మాత్రమేనని.. కానీ జాబితా వంద వరకూ ఉంటుందని సంకేతాలు పంపారు. ఇందులో పది మంది మంత్రుల పేర్లూ ప్రచారంలోకి వచ్చాయి. దీంతో అందరిలోనూ ఆందోళన ప్రారంభమయింది. అధికారికంగా టిక్కెట్ రాదని తెలిసిపోయిన వారి అనుచరులు రాజీనామాల బటపట్టారు. అసలు ఆళ్ల రామకృష్ణారెడ్డి లాంటి వాళ్లు రాజీనామాలు చేశారు మోపిదేవి వంటి వారుసైలెంట్ అయిపోయారు. కానీ వారి అనుచరులు మాత్రం రాజీనామాల బాట పట్టారు. టిక్కెట్ రాదని కంగారు పడుతున్న నేతల సంఖ్య తక్కువేం లేదు. అలాంటి వారందరూ ఇప్పటికైతే సైలెంట్ గా ఉన్నారు. కానీ.. తెర వెనుక ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం వైసీపీలో చేరికలేమీ లేకపోగా.. ఉన్నవారు రాజీనామా చేస్తున్నారు. ముందు ముందు వైసీపీలో చేరే వారు కూడా ఉండే అవకాశం లేదని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగుదేశం, జనసేన పార్టీ పొత్తులు పెట్టుకుని పోటీ చేస్తాండటం, మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో పాటు ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం, తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం వంటి కారణాలతో ప్రతిపక్షానికి మంచి ఊపు వచ్చింది. అందుకే రోజు మార్చి రోజు.. ఆ పార్టీ కార్యాలయాలు సందడిగా మారుతున్నాయి. పార్టీలో చేరేందుకు వివిధ నియోజకవర్గాల నుంచి జిల్లాల వారీగా వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నేతలు వస్తున్నారు. గురువారం టీడీపీ , జనసేన కార్యాలయాల్లో జోరుగా చేరికలు జరిగాయి. కానీ మంగళగిరిలోని వైసీపీ కార్యాలయం ముందు మాత్రం ఎలాంటి సందడి

### పక్క చూపులు చూస్తున్న నేతలు

లేదు. నిజానికి ఈ ద్వితీయ శ్రేణి నేతల్ని వారి గాడ్ ఫాదర్లే ముందస్తుగా.. టీడీపీ, బీజేపీల్లో చేరమని ప్రోత్సహిస్తున్నారన్న ప్రచారమూ ఉంది. ముందు ముందు ఈ చేరికలు మరింతగా జోరందుకోనున్నాయి. వైసీపీలో వంద మందికి టిక్కెట్లు నిరాకరిస్తున్నారని తేలిపోవడంతో చంద్రబాబు నాయుడు టీడీపీ ఆఫీసులో వ్యూహాత్మక వ్యాఖ్యాలు చేశారు. మిచౌంగ్ తుపాను కారణంగా 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా రైతులకు రూపాయి సాయం చేయలేదని..కనీసం కేంద్రానికి నివేదికలు పంపలేదని చెప్పేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసిన చంద్రబాబునాయుడు .. వైసీపీలో పరిస్థితిపై వ్యూహాత్మకంగా మాట్లాడారు. 151 మందిని మార్చినా ప్రయోజనం లేదని తేల్చేశారు. అదే సమయంలో తమ పార్టీలోకి రావాలనకునేవారికి ఓ రకమైన సందేశం పంపారు. అన్నీ పరిశీలించి.. సర్వేలు .. ప్రజాభిప్రాయం సేకరించి టిక్కెట్లు ఇస్తామన్నారు. అంటే.. వస్తామన్న వారికి టిక్కెట్ ఆప్షన్ ఉన్నట్లే. అదే సమయంలో నేరుగా వైసీపీ నుంచి ఎవరైనా వస్తే పరిశీలిస్తామని కూడా హామీ? ఇచ్చారు. ఇప్పటికే వైసీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు టీడీపీ వైపు వచ్చారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన సమయంలో మరో ఇరవై మంది కూడా టీడీపీలో చేరేందుకు రెడీగా ఉన్నారని ఆ పార్టీ నేతలు ప్రకటించారు. అది మైండ్ గేమా..నిజమా అన్నది తెలియదు కానీ..ఇప్పుడు చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు మాత్రం.. వైసీపీ పెద్దల్లో కాస్త ఆలోచన రేకెత్తించే అవకాశం ఉంది.

తెలుగుదేశం పార్టీ కాకపోతే జనసేన అన్నట్లుగా ఆ పార్టీ కూడా నేతల కోసం చూస్తోంది. జనసేన పార్టీకి పొత్తుల్లో భాగంగా వచ్చే సీట్లలో పోటీ చేయడానికి ఇంకా బలమైన అభ్యర్థులు లేరు. చాలా కొద్ది చోట్ల మాత్రమే ఉన్నారు. ఇతర నియోజకవర్గాల్లో ప్రస్తుత రాజకీయాలకు తగ్గట్లుగా పోటీ పడే నేతలు కావాలి. వారి కోసం జనసేన పార్టీ ఎదురు చూస్తోంది. వైసీపీలో అలజడితో ఆ పార్టీ నేతలతో సంప్రదింపులు జరిపేవారు పెరిగారన్న వాదన వినిపిస్తోంది. వైసీపీ నేతలకు టీడీపీ, జనసేన తలుపులు తెరిచే పరిస్థితులు కనిపిస్తూండటంతో.. మూడు నెలల ముందుగానే ఇంచార్జుల మార్పులతో పార్టీ నేతల్లో అలజడి రేపడం వ్యూహాత్మక తప్పిదం ఏమోనని వైసీపీ నేతలు ఇప్పుడు ఆలోచిస్తున్నారు. 11 మంది ఇంచార్జుల మార్పు తర్వాత ఒక్కసారిగా నెగటివ్ ప్రచారం పెరిగిపోయింది. వైసీపీ పరిస్థితి బాగోలేదని అందుకే ప్రజా వ్యతిరేకత తగ్గించుకునేందుకు ఇంచార్జుల్ని, అభ్యర్థుల్ని మారుస్తున్నారన్న ప్రచారం ఊపందుకుంది. అదే సమయంలో వైసీపీ క్యాంప్ నుంచే వచ్చిన వంద మంది అభ్యర్థుల మార్పు అనే అంశం కూడా మరింత నెగటివ్ గా వెళ్లింది. పేర్లతో సహా ప్రచారంలోకి రావడం మరింత మైనస్ అయింది. దీంతో ఎక్కువ మంది నేతలు సైలెంట్ అయిపోతున్నారు. ప్రత్యామ్నాయ రాజీకయ భవిష్యత్ కోసం ఆలోచించే ప్రణాళికలు వేసుకుంటున్నారు. దీంతో వైఎస్ఆర్‌సీపీ హైకమాండ్ అలర్ట్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దూకుడు తగ్గించి .. పార్టీ నేతల్లో భరోసా నింపాలనే ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. మొత్తంగా వైసీపీ ప్రకటించిన ఇంచార్జ్ లు మార్పు.. రాజకీయాల్లో అనూహ్యమైన మార్పులు తెచ్చాయి. అది వైసీపీ పెద్దలు ఊహించినట్లగా పాజిటివ్‌గా కాకుండా నెగెటివ్‌గా ఉండటమే అసలు రాజకీయం

# పోటీకి నో అంటున్న గల్లా

గుంటూరు, డిసెంబర్ 16, పాతూరి రాజగోపాల నాయుడు ఫ్రీడయ్ ఫైటర్, రాజకీయవేత్త, కిసాన్ లీడర్. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఈయన రాజకీయ గురువు. ఈయన కుమార్తె గల్లా అరుణకుమారి తన తండ్రి నుంచి రాజకీయ వారసత్వాన్ని పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు. అరుణ కుమారి భర్త గల్లా రామచంద్రనాయుడు.. అమరరాజా పేరుతో



బ్యాటరీ కంపెనీ స్థాపించి చిత్తూరు స్థానికులకు వేలసంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించిన పారిశ్రామికవేత్త. వీరి కుమారుడు గల్లా జయదేవ్ 2014, 2019లో తెలుగుదేశం పార్టీ తరఫున గుంటూరు నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. రాజకీయంగా మొదటి నుంచి ఘన చరిత్ర ఉన్న ఈ కుటుంబం ఇప్పుడు శాశ్వతంగా రాజకీయాలకు గుడ్ బై చెప్పబోతున్నారు. గల్లా అరుణ కుమారి కుమారుడు జయదేవ్?పారిశ్రామిక వేత్త, సూపర్ స్టార్ కృష్ణకు అల్లుడు. గల్లా జయదేవ్..టీడీపీ నేత..గుంటూరు ఎంపీ.. 2014లో తొలిసారి ఎంపీగా గెలిచారు. 2019లో జగన్ వేవ్‌ను కూడా తట్టుకుని రెండోసారి గుంటూరు నుంచే విజయం సాధించారు. అయితే ముచ్చటగా మూడోసారి పోటీకి మాత్రం నో అంటున్నారు. రాష్ట్రంలో టీడీపీ మరింత పుంజుకున్నా, మరోసారి గెలిచే అవకాశం ఉన్నా ఆయన మాత్రం పోటీపై ఆసక్తి చూపించడం లేదని సమాచారం. గత అనుభవాలు, వైసీపీ ప్రభుత్వం తనను, తన వ్యాపారాన్ని టార్గెట్ చేసిన తీరు చూశాక ఆయన పోటీ చేయకుండా ఉంటే మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దాంతో పాటూ ప్రస్తుత రాజకీయాలు తనకు సరిపడటం లేదని గల్లా జయదేవ్ సన్నిహితులతో చెప్పినట్లు తెలుస్తోంది. అందుకే పాలిటిక్స్ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. జిల్లాలోని గల్లా కుటుంబానికి చెందిన కంపెనీని రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందని, ఆ తరువాత నుంచి జయదేవ్ పొలిటికల్ యాక్టివిటీస్.. తగ్గించారనే ప్రచారం ఉంది. అందుకే గుంటూరు ఛాయలకు కూడా రాకుండా హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉంటున్నారని చెబుతున్నారు. పార్లమెంట్ సమావేశాలు ఉన్నప్పుడు మాత్రమే సభకు వెళ్తున్నారు. ఇక ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం తర్వాత కూడా ఆయన టచ్‌మీ నాట్ అన్నట్టు ఉంటున్నారని టాక్ నడుస్తోంది.గల్లా జయదేవ్ తల్లి అరుణ కుమారి 2014లో చంద్రగిరి నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. దాని తర్వాత 2019 ఎన్నికలకు ముందుగానే నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా కూడా రాజీనామా చేశారు. అయితే అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో అరుణ కుమారి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మూడు సార్లు మంత్రిగా కూడా చేశారు. అయితే 2014 తర్వాత అరుణ కుమారి రాజకీయాలకు దూరమయ్యారు.


## టీచర్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ మృతి పట్ల సంతాపం...




విభారే న్యూస్ డోన్ మా ప్రతిని:– డిసెంబర్ 16 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన అకాల మరణం చెందిన ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ గారి చిత్ర పటానికి పూలమాల సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాబు, వెంకట రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నేత, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, యూటీఎఫ్ కార్యకర్తలను, నాయకులను ఉద్యమం వైపు నడిపిస్తూ, ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహనీయుడు అని కొనియాడారు. చివరి నిమిషం వరకు ఉద్యమాలే అవధి గా జీవించిన అపర భగీరథుడు షాబ్జీ గారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, సుబ్బారెడ్డి, రవిశేఖర్, వెంకట లక్ష్మీ, రాధ, శ్రీనివాసులు, అల్లిపీరా, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, భూకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి,సుభాన్, శ్రీనివాసులు, బాబు, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి,హుస్సేన్ భాను, ముని రాజు, ప్రసాద్, రావు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ లో ఏపీ ఎన్నికలు

విజయవాడ, డిసెంబర్ 16, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు ఎపుడు అన్న పెద్ద డౌట్ ఉంది. ముందస్తు వెనకస్తు అంటూ చాలా ప్రచారం జరిగింది. విపక్షాలు రేపో మాపో ఎన్నికలు అంటూంటే అధికార వైసీపీ మాత్రం షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయని అంటూ వచ్చింది. ఇపుడు వైసీపీ మాటే నిజం కాబోతోంది. సార్వత్రిక ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి కలిపి ఒకేసారి ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. దాంతో ఏపీలో ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ మార్చిలో వస్తాయని, ఏప్రిల్ లో ఎన్నికలు జరుగుతాయని తెలుస్తుంది. ఈసారి ఏడెనిమిది దశలలో లోక్ సభ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది కేంద్ర ఎన్నికల సంఘం.మరి ఈసారి లోక్ సభ ఎన్నికల పోలింగ్ ఎన్నో ఊహగానాలు వెలువడుతున్నాయి. సౌత్ నుంచి తొలిదశ మొదలెడతారా లేక నార్త్ నుంచి వస్తూ మధ్య దశలలో ఏపీ ఉంచుతారా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే అంతకు ముందు ఎన్నికలు చూసుకున్నా మొదటి రెండు దశలలోనే ఏపీలో ఎన్నికలు జరిగాయి. కాబట్టి ఈసారి కూడా అదే ఆనవాయితీ కొనసాగిస్తారని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ నెలలో మొదటి రెండు దశలలో ఎన్నికలు జరగడం ఖాయంగా కనిపిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఈ విధంగా స్పష్టమైన సంకేతాలు ఉండబట్టే, ఏపీ ప్రభుత్వం కూడా అందుకు సన్నద్ధతను వ్యక్తం చేస్తూ, ఎన్నికల ముందు జరగాల్సిన ఇంటర్ టెంత్ పరీక్షలు ముందుకు జరిపించి మొత్తం పరీక్షల ప్రక్రియను మార్చి నెలాఖరుతో పూర్తి చేస్తోంది. ఇదే విషయాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ కూడా మీడియాకు చెప్పారు.సాధారణంగా ఏప్రిల్‌లో జరిగే పరీక్షలు.. ఈసారి నెల ముందుగానే జరగనున్నాయి. సాధారణ ఎన్నికల కారణంగా ముందుగానే నిర్వహిస్తున్నామన్నారు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ. మార్చి 1 నుంచి 15 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు.. మార్చి 18 నుంచి 30 వరకూ పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. నిజానికి ఏప్రిల్ లో పదవ తరగతి పరీక్షలు జరుగుతాయి. కానీ ఈసారి వాటిని ముందుకు జరిపారు. ఇక తొమ్మిది దాకా పరీక్షలను కూడా ఏప్రిల్ ఫస్ట్ వీక్ లో నిర్వహించి ఎన్నికల ప్రక్రియకు మొత్తం సిద్ధం చేస్తారు అని అంటున్నారు.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఎక్కువగా పోలింగ్ స్టేషన్లుగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలే వాడుకుంటారు. కాబట్టి ఈ ముందస్తు ఏర్పాట్లు అని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.



## ఉడ్ ల్యాండ్స్ హోటల్ లో ఒకరు హత్య, మరొకరు ఆత్మహత్య





మురళి ధర్ రెడ్డి,మూడవ పట్టణ సిఐ కర్నూలు నగరంలోని బుధవారపేట, ఉడ్ ల్యాండ్స్ హోటల్ లో శనివారం ఒకరు హత్య, మరొకరు ఆత్మహత్యకు గురైన ఘటన జరిగింది.ఘటనపై అక్రమసంబంధంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ నేపథ్యంలో మూడవ పట్టణ సిఐ మురళీ ధర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన విజయ్ కుమార్ (34),రుక్సానా(38)లు ఉడ్ ల్యాండ్స్ హోటల్,రూమ్ నంబర్ 210 అద్దెకు తీసుకున్నారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్, రుక్సానా కుమారుడికి ఫోన్ ద్వారా ఒక హోటల్ ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు.కాని హోటల్ పేరు చెప్పలేదన్నారు.కుమారుడు వారి కోసం విచారణ చేయగా,ఉడ్ ల్యాండ్స్ హోటల్ వద్ద విజయ్ కుమార్ వాహనం పార్కింగ్ చేసినట్లు గుర్తించాడు.రూమ్ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే రూమ్ లో రుక్సానా, విజయ్ కుమార్ లు విగత జీవులుగా పడి ఉన్నట్లు అందిన సమాచారంతో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

### నూనెపల్లె త్రిబుల్ ఆర్ హోటల్ వద్ద ఆక్సిడెంట్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 16 – నంద్యాల పట్టణం నుంచి – రైతు నగరం వెళ్లే దారిలో నూనెపల్లె ఫ్లైఓవర్ దిగగానే త్రిబుల్ ఆర్ కిచెన్ హోటల్ ఎదురుగా డీసీఎం లారీ ఢీ.రెండు భారీ వాహనాల మధ్యలో చిక్కుకున్న ఆటో నుజ్జునుజ్జు అయింది .ఘటన ప్రదేశంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మరో ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించినట్లు సమాచారం.క్షతగాత్రులు బనగానపల్లె వాసులుగా గుర్తింపు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మున్సిపాలిటీ పరది లో ముగిసిన వార్డుకు పోదాం'

### వెంకట దాస్ అసిస్టెంట్ కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 16– రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వార్డుకు పోదాం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పారవి సహకా రంతో నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 48 వార్డుల్లో చేపట్టిన వార్డుకు పోదాం కార్యక్రమం శుక్రవారంతో ముగిసిందని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు . మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంక టదాసు మాట్లాడుతూ నంద్యాల అర్బన్ పరిధిలోని 48 వార్డుల్లో డీబీటీ కింద 2,42,610 మంది లబ్ధిదారులకు సుమారుగా రూ. 683.07 కోట్ల మేర వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామన్నారు. నాన్ డీబీటీ కింద 1,41,827 మందికి లబ్ధి చేకూ రేలా రూ. 138.86 కోట్లను పలు రకాల అభివృద్ధి పనులను వెచ్చించామని వివరించారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించి, కృషి చేసినన ప్రజా ప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రాలను తెరిచారు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 16– కనీసం 26 వేలు జీతాలు ఇవ్వాలని సమస్యలు పరిష్కరించాలని గత ఐదు రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకుండా సమ్మెను అణచి వేసేందుకు సీడీపీఓ వారి సహకారంతో సచివాలయ ఉద్యోగుల ప్రమేయంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అంగన్వాడీ సెంటర్లు తెరిపి స్తున్నారని తెలిపారు . పట్టణంలో 115 అంగన్వాడీలు ఉంటే శుక్రవారం దాదాపు 22 అంగన్వాడీ తలుపులు తెరిపించారని శనివారం కూడా కొన్ని చోట్ల అధికారులు దగ్గరుండి తలుపులు తెరిపి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . ఆయా కేంద్రాల్లోని బాలింతలు. గర్భిణీలు. చిన్నారులు పౌష్టికాహారం అందించేందుకు ప్రతి అంగన్వాడీ కేంద్రాల యందు సచివాలయ ఉద్యోగులు ఉదయం 9– గంటల నుంచి మద్యాణం 1 గంట వరకు అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు.

# జాతీయస్థాయి క్రీడాకారులకు ప్రిన్స్ వహాబ్ ఆర్థిక సహాయం..


**జార్ఖండ్, అండమాన్ నికోబార్ జాతీయస్థాయి పోటీలో సత్తా చాటాలి..**





విభారె న్యూస్ డిసెంబర్ 16 ఎమ్మిగనూరు..జాతీయ స్థాయి ఎస్.జి.ఎఫ్ ఫుట్ బాల్ పోటీలలో ఎన్నికైన క్రీడాకారులు సత్తా చాటి ఎమ్మిగనూరు కు మంచి పేరు తేవాలని ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు వహాబ్ అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో వై.ఎఫ్.సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పట్టణానికి చెందిన మాచాని సోమప్ప బాలికల పాఠశాల విద్యార్థిని సౌమ్య ఎస్.జి.ఎఫ్ అండర్–14 ఫుట్ బాల్ జట్టుకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే పోటీలకు..దీక్ష కాలేజ్ విద్యార్థి ఈశ్వర్ ఎస్.జి.ఎఫ్ అండర్–17 ఫుట్ బాల్ జట్టుకు భారతదేశంలోని కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ ట్రాక్ షూట్, స్టడ్ షూస్, క్యాప్స్, స్టాకింగ్స్ లను ఉచితంగా అందజేశారు. అనంతరం ప్రిన్స్ వహాబ్ మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదని ఆర్థిక సహాయం అందించామన్నారు. అలాంటి వారికి చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు విజేతనాగరాజు, విశ్వనాథ్ రమేష్, సర్తాజ్, శేఖర్, ఓంకార్, రఘు, గుడికల్ వంశీ, పాలవీరేష్, తారక్, శివ తదితరులు పాల్గొన్నారు.

## 18 వ తేదీ సోమవారం శ్రీ సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం.



విభారె న్యూస్ డిసెంబర్ 16 ఎమ్మిగనూరు.పట్టణంలోని సోమప్ప నగర్ (కోసిగి రోడ్డు) లో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం లో స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం మాఘశుద్ధ షష్టి 18.12.2023 సోమవారం శ్రీ సుబ్రహ్మణ్య షష్టి (శ్రీ స్వాములవారి పుట్టినరోజు) ని పురస్కరించుకొని ఉదయం 7.00 లకు శ్రీ స్వామివారి మూలవిరాట్ కు మలాపకర్షణ స్నానం, పంచామృత అభిషేకములు, అష్టోత్తర కుసుమార్చన, భస్మార్చన ఉదయం 10 గంటలకు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం జరుగును. మధ్యాహ్నం 1.00గంటకు అన్నదాన కార్యక్రమము, సాయంత్రం 5.00 గంటలకు పల్లకి సేవ జరుగును. భక్తాదులు కుజదోషములు, వివాహం కాని వారు, సంతానం లేని వారు పై దోషములు పరిహారం చేసుకొనుటకు భగవంతుని కృపకు పాత్రులు కావలెనని ఆలయ ధర్మకర్త యు. వి. కేశవర్ధన భక్తులకు పిలుపునిచ్చారు. పై పూజా కార్యక్రమాలు అన్నియు వేదమూర్తులు, ఋగ్వేద పురోహితులు విష్ణువర్ధన శాస్త్రి, శివమణి శాస్త్రి, శంకరమణి గార్లచే పూజా కార్యక్రమాలు నిర్వహించబడును. కళ్యాణోత్సవమునకు కూర్చుని దంపతులు రు.516 లను చెల్లించి సాంప్రదాయ వస్త్రములు ధరించి రావలెను. ఆలయ అభివృద్ధికి విరాళములు అందజేయదలచిన వారు ఈ క్రింది బ్యాంకు ఖాతాకు పంపగలరు: 50200052884221ఐఎఫ్ఎస్సి కోడ్:ఊఆఈఅ0002438దేవాలయం గూగుల్ పే ఫోన్ పే నెంబరు:9949230194.




## ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న ఉద్యోగాలను భర్తీ చేయాలి

### పీడీఎస్ యు జిల్లా నాయకులు డిమాండ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 16 – రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా వున్న 2 లక్షల 50 వేల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నంద్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీ డీ ఎస్ యూ జిల్లా కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు నిరుద్యోగులను అన్ని విధాలుగా ఆదుకుంటాం మేము మాట ఇచ్చామంటే మడమ తిప్పమని ప్రగల్బాలు పలికిన అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్ గారు నేడు అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటిన ఇచ్చిన హామీలను మరచి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా వున్న ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల కడుపు కొడుతున్నాడు అనాడు ప్రజల సాక్షిగా జనవరి లో ఉద్యోగాల క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి మాట మార్చారని ఎద్దేవా చేశారు. గ్రూప్1 ,గ్రూప్ 2 పోస్టులు వదిలి నిరుద్యోగుల ఆశలను చిదిమేస్తున్నరని మండి పడ్డారు.గ్రూప్1,2లకు 45 సంవత్సరాల వరకు వయోపరిమితి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, రవి,సతీష్,వెంకట్, తదిరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీలలో రావూస్ జయభేరి....

- అథ్లెటిక్స్ లో 10 పతకాలు సాధించిన రావూస్ విద్యార్థులు.
- రాష్ట్రస్థాయి ఖో- ఖో సౌత్ జోన్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక



విభారె న్యూస్. ఎమ్మిగనూరు డిసెంబర్ 16.పట్టణంలోని రావుస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో గురువారం,శుక్రవారం జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో 10 పతకాల పంటను సాధించారు. 4100 మీటర్స్ రీలేలో విజయ్, ఉపేంద్ర,హరన్, జయశంకర్ రెండవ స్థానం సాధించగా,అలాగే 4100మీటర్స్ రీలేలో నందిని,రేఖ,పద్మా వతి ,జ్యోతి మూడవ స్థానం సాధించగా,800 మీటర్స్ సింగిల్ ఈవెంట్ లో ఉపేంద్ర రెండవ స్థానాన్ని సాధించగా,100మీటర్స్ సింగిల్ ఈవెంట్లో నందిని మూడవ స్థానం సాధించడం జరిగింది.ఈ అథ్లెటిక్స్ పోటీల్లో రిలే 8 పతకాలు, సింగిల్ ఈవెంట్లో 2 పతకాలు సాధించడం జరిగింది.అంతేగాక తమిళనాడు రాష్ట్రంలోని తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ తిరువారుర్‌లోజరిగే రాష్ట్రస్థాయి సౌత్ జోన్ ఖో–ఖో పోటీలకు నందిని, రేఖ,పద్మావతి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందనిరావుస్‌కళాశాలసీఈఓతిరుమలరెడ్డి తెలియజేస్తూ, పతకాలుసాధించిన విద్యార్థిని,విద్యార్థులను శనివారం అభినందించారు.ఈకార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు ధనుంజయ, గోవిందు మిగిలిన అధ్యాపక బృందం పథకాలు సాధించిన విద్యార్థులపట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## బహుజన్ సమాజ్ పార్టీ కర్నూలు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా అరుణ్ కుమార్ ఎన్నిక..



కర్నూలు విభారె న్యూస్ డిసెంబర్ 16. బహుజన రాజ్యాధికార సభను జయప్రదం చేయండి బహుజన సమాజ్ పార్టీ కర్నూలు నియోజకవర్గం ఆధ్వర్యంలో స్థానిక కింగ్ మార్కెట్ దగ్గర ఉన్న ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్ నందు బహుజన రాజ్యాధికార సభను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ బాలయ్య,మల్లికల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ కోఆర్డినేటర్ బాలయ్య మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరం జ్యోతి ఆదేశాల మేరకు కర్నూలు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా అరుణ్ కుమార్ ప్రకటించారు.కర్నూలు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అరుణ్ కుమార్ మాట్లాడుతూ కర్నూల్ లో కష్టపడి ప్రతి ఇంటికి ఏనుగును పరిచయం చేసి కర్నూల్ నియోజకవర్గం లో నీలి జెండాను స్థాపించి కైవసం చేసుకునే దిశగా పనిచేసి కర్నూల్ లో నీలి జెండాను స్థాపిస్తామని పేర్కొన్నారు. లక్ష్మి నారాయణ, జై రాజ్ మీడియాతో మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ బీసీలకు వంద స్థానాలు ఇస్తున్నామని అధ్యక్షులు తెలియజేశారన్నారు రానున్న ఎన్నికల్లో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వారికి తగిన రాజకీయ వాటా ఇచ్చి మనువాద పార్టీలైన వైసీపీ టీడీపీని ఓడించి ఆంధ్ర రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ బలమైన పార్టీగా నిలపడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ రాజకీయ శక్తిగా మారే అవకాశాలు ఉన్నాయన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ కర్నూల్ జిల్లా కమటీ, అసెంబ్లీ కమిటీ, నగర కమిటీ నగర అధ్యక్షులు సాదిక్ అలీ, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190